


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 18-05-2024 సంపుటి : 06 సంచిక : 244 పేజీలు : 8 వెల : రూ 3-00

## హ్యాట్రిక్ ఖాయం ...!

### మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేది మేమే : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ మే 17(( విభారె) ): ఎన్నికల్లో దేశం కోసం పనిచేసే ఎన్డీఏ, దేశంలో అస్థిరతను పెంచే ఇండియా కూటమి మధ్య పోరు జరుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. దేశ ప్రజలు బీజేపీవైపే ఉన్నారని.. ఎన్డీఏ విజయం ఖాయమని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాన మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. . మా ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టబోతుందన్నారు. గెలిచినత పేదల కోసం ఎన్నో నిర్ణయాలు తీసుకోబోతున్నామని చెప్పారు. మీ ఓటు వల్లే రామమందిరం నిర్మాణం జరిగిందన్నారు. బలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం వల్లే రామమందిరం సాధ్యమైందని ప్రధాని అన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే.. వాళ్లు మోడీని తిట్టడమే పనిగా పెట్టుకుంటారన్నారు. తిట్టడం కోసం మనం ఎరినైనా ఎన్నుకుంటామా?.. అలాంటి వాళ్ల వల్ల పనులు జరుగుతాయా?.. మనకు పనులు చేసే వ్యక్తి కావాలని మోడీ అన్నారు.హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలో దారుణం జరిగింది. ప్రియుడి మోజులో కట్టుకున్న భార్తను సుఫారీ ఇచ్చి హత్యచేయించింది ఓ భార్య. గుండెపోటుతో మరణించాడని ఎవ్వరికీ అనుమానం రాకుండా దహనసంస్కారాలు కూడా చేసింది.ఈ ఘటన జరిగిన మూడు నెలల తర్వాత నిందితుడు లొంగిపోవడంతో అసలు విషయం బయటపడింది.మధురానగర్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎహైదరాబాద్ లోని ఎల్లారెడ్డి గూడలో జయప్రకాశనగర్ లోని శిఖర అపార్డ్ మెంట్ లో నివాసం ఉండే సీసీ కెమెరా టెక్నీషియన్ విజయ్ కుమార్(40)కు భార్య శ్రీలక్ష్మి (33), ఇద్దరు మగ పిల్లలు (9, 8 ఏండ్లు) ఉన్నారు. కొంత కాలంగా బోరబండకు చెందిన రాజేశ్ (30)తో శ్రీలక్ష్మి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోంది. వీళ్ల బంధానికి తన భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన శ్రీలక్ష్మి ప్రియుడితో కలిసి మర్డర్ కు ప్లాన్ చేసింది. భర్త పేరు మీద మేడ్చల్, ఎల్లారెడ్డిగూడలో సొంత ఇండ్లు ఉన్నాయి. భర్తను హత్య చేయించి ఎంజాయ్ చేద్దాం అనుకుంది. ఎల్లారెడ్డిగూడలో ఉంటున్న ఇల్లు వాస్తు బాగో లేదని చెప్పి శిఖర అపార్టమెంట్ కు మకాం మార్పించి మర్డర్ కు ప్లాన్ చేసింది.

## లోక్‌సభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్..

### ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో మొదలైన ఆందోళన..!

తిరుగులేదని ఒక పార్టీ భావించింది.. ఒక్క ఓటు కూడా చీలకుండా పక్కాగా పడాలని ఆదేశించింది మరో పార్టీ. కానీ అధిష్టానం ఒకటి తలిస్తే.. కేడర్ మరోలా స్పందించింది.అందుకే రావాల్సిన ఓట్లు పడకపోగా.. ప్రత్యర్థికి చీలిపోయాయి. పార్టీ ఆదేశించినా పెడచెవిన పెట్టి? ఆత్మప్రబోధానుసారం ఓటేసి షాకిచ్చింది కేడర్. మొత్తానికి మూడు ప్రధానపార్టీలకు ఇది ఊహించని షాకే. ఇంతకీ ఇదెక్కడ జరిగింది? ఏ పార్టీలకు ఈ అనుభవం ఎదురైంది?ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది. పోటా పోటీగా ప్రచారం నిర్వహించి, గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నారు మూడు పార్టీల నాయకులు. అధికారంలో ఉన్నాం..ఆరుగ్యారంటీలుకలిసి వస్తాయని కాంగ్రెస్, ప్రభుత్వ వ్యతిరేకత లాభిస్తుందని బీఆర్ఎస్, మోదీ ప్రభంజనం బీజేపీ ఒక్క అవకాశం



ఇవ్వండి చేసిన ప్రచారం తమకు అనుకూలంగా మారుతుందని కాషాయ దళం గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు. అయితే కొన్ని నియోజక వర్గాల్లో ప్రధాన పార్టీల మధ్య క్రాస్ ఓటింగ్ జరిగిందని ప్రచారం జోరందుకుంది. క్రాస్ ఓటింగ్ ఎవరికి లాభం ఎక్కడ జరిగింది. పోలింగ్ తీరు, గెలుపు ఓటములపై లెక్కలు వేసుకుంటున్నారు నేతలు.ఖమ్మం జిల్లాలో మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్ అదే ఉత్సాహంతో పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో సత్తా చాటాలని ప్రచారం నిర్వహించింది. ముగ్గురు మంత్రులు ఎమ్మెల్యేలు శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ భారీ మెజార్టీ సాధించాలని టార్గెట్ పెట్టుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, ఆరు గ్యారంటీ అమలు చేయక పోవడం, తమకు అనుకూలంగా మారుతుందని బీ ఆర్ ఎస్ విస్తృత ప్రచారం చేసింది. నరేంద్ర మోదీ ప్రభంజనం ఖమ్మం లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండని కమలం పార్టీ నేతలు ప్రచారం చేశారు. ఎన్నికలు ముగిశాయి. ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.








## ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..

అమరావతి:మే :17( విభారె) ఏపీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్ ఎన్నో అభివృద్ధి సంక్షేమ పతకాలు అమలు చేస్తున్నారు.ముఖ్యంగా విద్య,వైద్య,రైతు,మహిళల కోసం వివిధ సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువచ్చారు.ముఖ్యంగా రాష్ట్రంలో రైతులను,వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఏపీ సర్కార్ వ్యవసాయంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చింది.తాజాగా ఏపీ సర్కార్ రైతుల కు మరో శుభవార్త అందించింది.వివరాల్లోకి వెళితే రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని,రైతుల జీవనశైలి లో మార్పులు తీసుకు వచ్చే విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు రూపొందించామని పలు సందర్భాల్లో సీఎం జగన్ అన్నారు.తాజాగా అన్నదాతలకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ అందించింది.ఏపీ రైతులకు సబ్సిడీ పై జగన్ సర్కార్ విత్తనాలు అందించనుంది.ఖరీఫ్ సీజన్ కోసం ఈ నెల 20 వ తేదీ నుంచి సబ్సిడీ పై విత్తనాలను పంపిణీ చేసేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఈ నిర్ణయంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు.16.19 లక్షల క్వింటాళ్ల విత్తనాలపై 50 శాతం, వేరు శనిగపై 40 శాతం సబ్సిడీ ఇవ్వనుంది. దీని కోసం 450 కోట్లు ఖర్చు చేస్తుంది ఏపీ సర్కార్.195 కోట్ల సబ్సిడీ భరించనుంది. పచ్చి రొట్ట, చిరుదాన్యాల విత్తనాలపై 50 శాతం,వేరు శనిగపై 40 శాతం సబ్సిడీ ఇవ్వనుంది.ఎన్ఎఫ్ఎస్ఎం పరిధిలోని జిల్లాల్లో వరి విత్తనాలు క్వింటాల్ వెయ్యి రూపాయలు, మిషన్ పరిధిలోని లేని జిల్లాల్లో 500 రూపాయల చొప్పున సబ్సిడీ ఇస్తున్నట్లు ప్రకటించింది.ఈ మేరకు ఏపీ సర్కార్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

## మోడీతో ఏది చెప్పించాలన్న చెప్పిస్తాను: రాహుల్ గాంధీ




రాయబరేలి: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటు కేరళలోని వాయ్ నాడ్ నుంచి, అటు రాయబరేలి నుంచి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఆయన రాయబరేలిలో ప్రచారం చేస్తూ " నేను ప్రధాని నరేంద్ర మోడీ తో ఏదైనా చెప్పించగలను. నరేంద్ర మోడీ అంబానీ, అదానీ పేర్లను ఎత్తనే ఎత్తరని నేనన్నప్పుడు ఆయన రెండు రోజులు తర్వాత అదానీ, అంబానీ ల పేర్లను ఎత్తారు. ఆ తర్వాత నేను బ్యాంకు ఖాతాలో డబ్బు టకాటక్ వేస్తానని చెప్పాను. నరేంద్ర మోడీ తర్వాత 'టకాటక్' అని తన ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఏమి చెప్పించాలనుకుంటున్నారో నాకు చెప్పండి. నేను రెండు నిమిషాలలో చెప్పిస్తాను. అలాగే ఆయనతో ఏమి చెప్పించకూడదనుకుంటున్నారో అది కూడా చెప్పండి. దానిని కూడా నేను ఆయన చేత చేపిస్తాను" అన్నారు." మోడీ ఓటమిని అంగీకరిస్తున్నారు. జూన్ 4 తర్వాత మోడీ ప్రధానిగా ఉండబోరని నేను రాసిస్తాను" అని రాహుల్ గాంధీ అన్నారు.రాయ్ బరేలి లోక్ సభ ప్రచార సభ ర్యాలీలో సోనియా గాంధీ ప్రసంగించారు. ఆ సందర్భంగా సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ కూడ ఉన్నారు. సోనియా గాంధీ తన ప్రసంగంలో 20 ఏళ్లుగా రాయ్ బరేలి ఎంపీగా సేవలందించేందుకు సహకరించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆమె రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు.సోనియా గాంధీ తన ప్రసంగంలో " ఇది నా జీవితంలో పెద్ద ఆస్తి. మీకు గౌరవపూర్వకంగా నేను శిరస్సు వంచుతున్నాను. రాయ్ బరేలి నా కుటుంబం, అమేథి నా ఇల్లు. ఈ రెండు స్థానాలలోని ప్రజలతో నాకు సంబంధం ఉంది. ఈ సంబంధం పవిత్ర గంగమ్మ వంటిది. రాయ్ బరేలిలో ఇందిరా గాంధీకి ఓ ప్రత్యేక స్థానం ఉంది. నేను ఇందిరమ్మ బాటలో నా పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పెంచాను. రాయ్ బరేలి నాకు అందరినీ గౌరవించమని నేర్పింది. బలహీనులను రక్షించమంది. న్యాయం కోసం పోరాడమంది?" అంటూ సోనియా ప్రసంగించారు. " నేను నా కుమారుడు రాహుల్ గాంధీని మీకు అప్పజెప్పుతున్నాను. అతడు మిమ్మల్ని నిరాశ పరచడు" అన్నారు.






హైదరాబాద్/అమరావతి మే 17(( విభారె) : తెలుగు రాష్ట్రాలను అలర్ట్ చేసింది వాతావ రణశాఖ. రానున్న ఐదురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయం టూ హెచ్చరించింది. పలు జిల్లా ల్లో ఎల్లో హెచ్చరిక జారీచేసింది. ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఏపీలో ఐదు రోజులపాటు కుండపోత వానలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కోస్తాంధ్రను ఆనుకుని ఉపరితల ద్రోణి ఏర్పడటం కారణంగా కోస్తాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది వాతావరణ శాఖ. దీంతో ఇవాళ ప్రకాశం, నెల్లూరు, కర్నూ లు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది వాతావరణశాఖ. ఆయా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని చెప్పింది. అక్కడక్కడా పిడుగులు పడే అవకాశం. నైరుతి రుతుపవనాలు ఈనెల 19 నాటికి దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగా ళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవులలోకి ప్రవేశించే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ అంతర్గత కర్ణాటక నుండి తూర్పు విదర్భ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ఉన్న ద్రోణి బలహీన పడటంకారణంగా..ఆంధ్రప్రదేశ్,యానాంలోదిగువ ట్రోపో ఆవరణము లో ఆగ్నేయ గాలులు వీస్తున్నాయని పేర్కొంది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. గంటకు 40 నుంచి50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది తెలిపింది వాతావరణశాఖ.తెలంగాణ లోను వచ్చే 5 రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇవాళ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబనగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది.గంటకు 40 నుంచి 50 కి.మీల వేగంతో గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఐదు రోజుల పాటు ఆయా జిల్లాలకు యెల్లో హెచ్చరిక జారీచేసిందివాతావరణశాఖ.18 నుంచి20వరకు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని.. ఉరుములు, మెరుపులు, ఈదురుగా లులతో వానలు పడే అవకాశం ఉందని వివరించింది. మరోవైపు హైదరాబాద్‌లో భారీ వర్షాలపై జీహెచ్ఎంసీ అలర్ట్ అయింది. అధికారులతో మేయర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాలాల దగ్గర ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈదురుగాలులతో చెట్లు విరిగే ప్రమాదం ఉన్నందున.. సిబ్బంది అప్రమత్తంగాఉండాలని లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

## 2019 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తాం: సజ్జల

రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో విజయంపై తమకు పూర్తి విశ్వాసంతో ఉందని వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 2019లో వచ్చిన సీట్ల కంటే ఈ సారి ఎక్కువ సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సజ్జల మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు ఆయన మీద ఆయనకే నమ్మకం? లేదన్నారు. చంద్రబాబు పూర్తిగా నెగిటివ్ క్యాంపెన్ చేశారని విమర్శించారు.జగన్ ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని చెప్పారు. ఓటింగ్ సరళిని చూసి ప్రభుత్వ వ్యతిరేక ఓటు అనుకోవద్దని ఆయన పేర్కొన్నారు. కేంద్రంతో కలిసి కొంతమంది అధికారులను కుట్రపూరితంగా చంద్రబాబు తప్పించారని ఆరోపించారు. అధికారుల మార్పుతో?టిడిపి కార్యకర్తలకు పోలీసులు సహకరించారని.. దాంతో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాని సజ్జల చెప్పారు.

# సంపాదకీయం

శనివారం 18-05-2024

## మారణహోమానికి ఫుల్ స్టాప్ ఎప్పుడు

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య మొదలైన యుద్ధం 223 రోజులకు చేరింది. ఈ ఏడున్నర నెలల మారణహోమాన్ని ఆపేందుకు ఈజిప్టు, ఖతార్ ప్రతినిధుల మధ్యవర్తిత్వంలో ఈజిప్టు రాజధాని కైరోలో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో కాల్పుల విరమణ ఒప్పందానికి పాలస్తీనా ఉగ్రవాద సంస్థ.. హమాస్ సమ్మతి తెలపడంతో ఇక యుద్ధం ముగిసి, శాంతి నెలకొంటుందని అందరూ భావించారు. కానీ, అంతలోనే చర్చల నియమాలకు నీళ్లొదిలిన హమాస్, కీరమ్ షెలోమ్ సరిహద్దు క్రాసింగ్‌పై క్షిపణి దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురు ఇజ్రాయెల్ సైనికులు బలికావడం, తామే ఈ దాడి చేశామని హమాస్ ప్రకటించుకోవటంతో ఇజ్రాయెల్ తీవ్రంగా ప్రతిస్పందించింది. ' ఇక.. ఏ దేశం అండగా నిలిచినా, నిలవకున్నా..ఏ అంతర్జాతీయ సంస్థ మమ్మల్ని వెలివేసినా మా దేశాన్ని మేమే రక్షించుకోకుండా ఎవరూ ఆపలేరు' అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ భీకర ప్రకటన చేశారు. దానికి కొనసాగింపుగా, గాజాకు ఆహారం, ఇతర మానవతా సాయం అందించే ఏకైక మార్గాన్ని మూసివేయాలని ఆయన ఆదేశించారు. మంగళవారం తెల్లవారుజామున సమయానికి ఇజ్రాయెల్ వాయుసేన భీకర దాడికి దిగి, రఫా–ఈజిప్టు సరిహద్దుకు ఆనుకుని ఉన్న పాలస్తీనా వైపు ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా గాజాలో మృతిచెందిన వారి సంఖ్య 34,736కి చేరిందని, మరో 78 వేల మంది గాయాల పాలయ్యారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.తమ దేశంపై జరిగిన దాడికి తాము దీటుగా స్పందించామని, బాధిత దేశంగా ఉన్నప్పటికీ తాము ఖతార్, ఈజిప్ట్ దేశాల మధ్యవర్తిత్వాన్ని హుందాగా తాము అంగీకరించి చర్చలకు సిద్ధపడ్డామని, కానీ, హమాస్ మాటతప్పి తమమీద తాజాగా దాడిచేయటంతో చర్చల మీద తమకున్న ఆశలు ఆవిరయ్యాయని నెతన్యాహూ ప్రకటించారు. ఇంకా శాంతి, సంయమనం అంటూ గాజా నుంచి తాము వెనక్కి వస్తే, హమాస్ దళాలకు తిరిగి పుంజుకునేందుకు తగిన సమయం దొరుకుతుందని, దీంతో వారుఅనతి కాలంలో మళ్లీ సాయుధ, మిలిటరీ సంపత్తిని పెంపొందించుకుని, తమపై దాడికి దిగుతారనేది నెతన్యాహూ వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే రఫాపై దాడికి ఇజ్రాయెల్ మంత్రివర్గం ఏకగ్రీవ ఆమోదం తెలపడంతో.. ఇజ్రాయెల్ సేనలు రఫా దిశగా సాగిపోతున్నాయి. ఇప్పటికే గాజాస్ట్రిప్ వైపున ఉన్న రఫా సరిహద్దులను ఆక్రమించుకున్న ఇజ్రాయెల్ సేనలు, హమాస్ స్థావరాలే లక్ష్యంగా దాడులకు రెడీ కావటంతో రఫాలో తలదాచుకుంటున్న లక్షల మంది శరణార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇజ్రాయెల్ సేనలు వారిని అక్కడి నుంచి ఖాళీ చేయిస్తూ, భీకర దాడికి సిద్ధం కావటం యావత్ ప్రపంచాన్ని కలవరపరుస్తోంది. శాంతి చర్చల కోసం నెలల తరబడి జరిగిన ప్రయత్నాలన్నీ తాజా పరిణామాలతో వృధాగా మారాయి.మరోవైపు రఫాపై ఇజ్రాయెల్ దాడులకు సిద్ధం కావటంతో ఐక్యరాజ్య సమితి తలపట్టుకుంటోంది. యుద్ధం కారణంగా శరణార్థులుగా మారిన వారికోసం ఐక్యరాజ్యసమితి సేకరిస్తున్న ఆహారం, ఔషధాలు వంటవన్నీ రఫాలోని గోదాముల్లో నిల్వ చేశారు.గాజా నగరాన్ని నేలమట్టం చేసిన ఇజ్రాయెల్, రాబోయే రోజుల్లో రఫా నగరాన్నీ సర్వనాశనం చేయకుండా ఊరుకోదని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోందిచర్చలకు హమాస్ దిగిరావటానికి ఇదీ ఒక ప్రధాన కారణంగా ఉంది. మరోవైపు హమాస్ సాయుధులు జనంలో కలసిపోవటంతో వారిని పట్టుకోవటం ఇజ్రాయెల్‌కు తలకు మించిన భారంగా మారుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో కైరోలో నిలిచిపోయిన శాంతి చర్చల పునరుద్ధరణకు చర్చల మధ్యవర్తిగా ఉన్న ఖతార్‌తో చర్చించేందుకు అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ డైరెక్టర్ బిల్ బర్న్స్ బయలుదేరినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. తాను సైతం చర్చలకు సిద్ధమేనని హమాస్ కూడా అంగీకరించిందని, ఈ మేరకు ఖతార్, ఈజిప్ట్ దేశాల మధ్యవర్తులకు హమాస్ సందేశాన్ని కూడా పంపినట్లుగా కూడా తెలుస్తోంది. ఇజ్రాయెల్ సైతం చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించినా, దాడులు ఆపబోమని తెగేసి చెప్పటమే గాక రఫా నగరం నుంచి పాలస్తీనియన్లు తక్షణం వెళ్లిపోవాలని విమానాల ద్వారా కరపత్రాలను వదలిపెట్టటంతో ఈ చర్చలు ముందుకు సాగవనే భయాలు పెరిగిపోతున్నాయి ఇజ్రాయెల్ తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పటివరకు ఇజ్రాయెల్‌కు అన్నివిధాలా అండగా నిలిచిన అమెరికా పరిస్థితిలో కుడితిలో పడిన ఎలుకలా మారింది.

# ఇక పవర్ ప్లాంట్లపై గురి

## ఒప్పందాలపై బహిరంగ ప్రకటన

ఖమ్మం, మే 17 (న్యూస్ పల్స్)బీఆర్ఎస్ హయాంలో యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలు, చత్తీస్‌గడ్ నుంచి విద్యుత్ ఒప్పందాలపై దర్యాప్తునకు కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి నెలలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ వేసింది. ఈ కమిషన్ దర్యాప్తును వేగవంతం చేసింది. తాజాగా, విచారణలో భాగంగా జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి ఓ బహిరంగ ప్రకటన విడుదల చేశారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ల నిర్మాణం, చత్తీస్‌గడ్ విద్యుత్ ఒప్పందాలపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే పది రోజుల్లో అందించాలని ప్రకటనలో పేర్కొన్నారు.మణుగూరు సమీపంలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ స్థాపించడానికి అత్యంత ప్రభావవంతమైన సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కాకుండా సబ్ క్రిటికల్ టెక్నాలజీని వినియోగించారని, రెండేళ్ల కాలం వ్యవధి సరిపోతుండగా.. దాన్ని అధిక మూల వ్యయంతో ఎక్కువ కాలం అంటే 7 సవత్సరాల కాలం తీసుకోవడానికి గల కారణాలపై విచారణ జరుగుతుందని కమిషన్ పేర్కొంది. బహిరంగ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ కాకుండా పూర్తిగా నామినేషన్ ప్రాతిపదికన ఈపీసీకి కాంట్రాక్ట్ అందించడంపైనా ఆరోపణలను ప్రస్తావించింది. అలాగే, డిస్కమ్స్ నుంచి ఎక్కువ వ్యయానికి కారణమవుతూ 179 నుంచి 388 కిలోమీటర్ల దూరంలోగల సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కోల్ ఫీల్డ్స్ నుంచి బొగ్గు సరఫరాతో దామరచర్ల వద్ద యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎందుకు స్థాపించారని, ఇందులోనూ బహిరంగ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ కాకుండా ఎందుకు నామినేషన్ ప్రాతిపదికను సదరు యూనిట్ స్థాపనకు ఈపీసీకి కాంట్రాక్ట్ అందించారని పేర్కొందివీటితోపాటు చత్తీస్‌గడ్ రాష్ట్ర డిస్కమ్స్ నుంచి విద్యుత్ సేకరణకు బహిరంగ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ అనుసరించలేదని కమిషన్ పేర్కొంది. కాంట్రాక్ట్ చేసుకున్న కెపాసిటీకి చాలా తక్కువ విద్యుత్ షెడ్యూలింగ్ అయినప్పటికీ పూర్తి కాంట్రాక్ట్ కెపాసిటీ అంటే 1000 మెగావాట్ల కొరకు కారిడార్‌కు సంబంధించి పీజీసీఐఎల్‌కు పూర్తి చెల్లింపులు జరిపారని వివరించింది. వీటిపైనా దర్యాప్తు చేపడుతున్నట్టు కమిషన్ పేర్కొంది. వీటికి సంబంధించి వివరాలు తెలిసినా లేదా అవగాహన ఉన్న వ్యక్తులు, సంస్థలు, నిపుణులు పది రోజుల్లోగా ఇనీతి2024.జూనీలివతీఏణఎజీతిశ్రీ.ఇనీఎకు ఈమెయిల్ లేదా బీఆర్కే భవన్‌లో 7వ అంతస్తులోని కమిషన్ కార్యాలయానికి వచ్చి లేదా తపాలా ద్వారా బట్వాడా కూడా చేయవచ్చునని వివరించింది.మౌఖిక సాక్ష్యాలు ఇవ్వాలనుకుంటే తమకు ఆ విషయాన్ని తెలియజేస్తే అభ్యర్థనను కమిషన్ పరిశీలించి నిర్ణయాన్ని కమిషన్ తెలియజేస్తుందని జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి ఆ ప్రకటనలో వెల్లడించారు

## ఉత్తరప్రదేశ్‌లో మా కూటమి 40 సీట్లు గెలుస్తుంది : డీకే శివకుమార్



ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలకుగాను తమ కూటమి 40 స్థానాలు గెలుస్తుందని కాంగ్రెస్ సీనియర్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి మంచి స్థితిలో ఉన్నాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మేం 40 సీట్లు గెలుస్తాం' అని ఆయన వ్యాఖ్యానించారు.తాను తమ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఇప్పుడే కలిశానని, మా 10 గ్యారంటీల గురించి ఆయన ముందు ప్రస్తావించానని డీకే చెప్పారు. ఈ సందర్భంగా ఖర్గే మరో హామీని ప్రకటించారని తెలిపారు. పేదలకు ప్రతి నెల అదనంగా 10 కిలోల ఉచిత బియ్యం ఇవ్వనున్నట్లు ప్రకటన చేశారని వెల్లడించారు. మేం ఇచ్చిన హామీలన్ని ప్రజాసంక్షేమానికి ఉపకరించేవిగా ఉన్నందున లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మాకే అనుకూలంగా ఉండబోతున్నాయని అన్నారు.కాగా, ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. బీఎస్పీకి, సమాజ్‌వాదీ పార్టీకి, బీజేపీకి ఎక్కువ ఓటు బ్యాంకు ఉంది. ఇప్పుడు సమాజ్ వాదీ ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో తమ కూటమికి 40 సీట్లు వస్తాయని డీకే ధీమా వ్యక్తం చేశారు. 2019లో బీఎస్పీ, ఎస్పీ, ఆరెల్డీ కలిసి కూటమిగా బరిలో దిగాయి. ఆ కూటమికి 15 సీట్లే వచ్చాయి. ఎన్డీఏ కూటమి 64 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్‌కు ఒక్క సీటు మాత్రమే వచ్చింది. ఈసారి కాంగ్రెస్, ఎస్పీ ఇండియా కూటమిగా బరిలో ఉన్నాయి. బీఎస్పీ ఒంటరిగా పోటీ చేస్తున్నది.

## బీజేపీకి 400కిపైగా స్థానాలు దక్కడం కల..మోదీ ఓటమి వాస్తవం : కాంగ్రెస్

బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమికి 400కిపైగా స్థానాలు వస్తాయని, తమకు సాధారణ మెజారిటీ కోసం ప్లాన్ బీ అవసరం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధిర్ రంజన్



చౌధరి స్పందించారు. అమిత్ షా వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. బీజేపీ 400కిపైగా స్థానాల నినాదం ఫలించబోదని స్పష్టం చేశారు.బీజేపీ ఓవైపు 400కిపైగా స్థానాలు సాధిస్తామని చెబుతోందని, అయితే ఈసారి ప్రధాని నరేంద్ర మోదీకి అధికారం దక్కబోదని తాము చెబుతున్నామని అన్నారు. ఈసారి 400కిపైగా స్థానాలు కాషాయ కూటమి కల అని, మోదీ ఓటమి వాస్తవమని, ఈసారి జరిగేది ఇదేనని అధిర్ రంజన్ చౌధరి పేర్కొన్నారు. కాగా, ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ 60 కోట్ల మంది లబ్ధిదారుల సైన్యం ప్రధాని మోదీకి అండగా ఉంది. వారికి కులం, వయసుతో సంబంధం లేదు. మోదీ అంటే ఏంటి.? ఆయనకు 400 సీట్లు ఎందుకు ఇవ్వాలి..? అనేది వారికి తెలుసు అన్నారు.'ప్లాన్ ఏ' విజయవంతమవుతుంది. 'ప్లాన్ ఏ' సక్సెస్ కావడానికి 60 శాతం కంటే తక్కువ అవకాశం ఉన్నప్పుడే 'ప్లాన్ బి' ని రూపొందించాలి. మాకు ఇప్పుడు ఆ అవసరం లేదు. ప్రధాని మోదీ అఖండ మెజారిటీతో అధికారంలోకి వస్తారని నేను ఖచ్చితంగా నమ్ముతున్నా' అని అమిత్‌షా పేర్కొన్నారు

## కాంగ్రెస్ నిర్వాకంతో కర్నాటకలో కుప్పకూలిన శాంతిభద్రతలు : జగదీష్ షెట్టార్



కర్నాటకలో రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలనతో శాంతి భద్రతల పరిస్థితి కుప్పకూలిందని కర్నాటక మాజీ సీఎం, బెలగావి బీజేపీ అభ్యర్థి జగదీష్ షెట్టార్ ఆరోపించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో నిత్యం హత్యలు, దోపిడీలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలనలో రాష్ట్రమంతటా శాంతి భద్రతలు గాడితప్పాయని అన్నారు. రాష్ట్ర ప్రజలు భయాందోళనల మధ్య బతకాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. నేహ, అంజలి హత్య కేసులు ఇందుకు ప్రబల నిదర్శనమని పేర్కొన్నారు. ఈ హత్యోదంతాలపై త్వరితగతిన విచారణ చేపట్టి వీలైనంత త్వరలో ఈ కేసుల దర్యాప్తును కొలిక్కితీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, మోదీ మరోసారి ప్రధానిగా పాలనా పగ్గాలు చేపడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లు విడుదల



హైదరాబాద్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మ. 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో ఇవాళ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు నేరుగా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకున్న తర్వాత విద్యార్థులు తమ ఫొటో, సంతకం, పేరు, మీడియంతో పాటు ఏయే సబ్జెక్టులు రాస్తున్నామో వాటిని గమనించాలి. వాటిలో ఏవైనా తప్పులు ఉంటే తక్షణమే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలి. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్స్ సంతకాలు లేకపోయినప్పటికీ పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఇంటర్ బోర్డు చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది.

## త్వరలోనే గ్రూప్-4 సర్టిఫికెట్ వెరిఫికేషన్.. ఈ డాక్యుమెంట్లు తప్పనిసరి




హైదరాబాద్ : గ్రూప్–4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జనరల్ అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో, పీడబ్ల్యూడీ అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో పిలవనున్నారు.కమ్యూనిటీ, నాన్ క్రిమి లేయర్(బీసీలకు), పీడబ్ల్యూడీ సర్టిఫికెట్స్, స్టడీ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్స్(క్లాస్ 1 నుంచి ఏడు వరకు), రిజర్వేషన్ కలిగి ఉంటే దానికి సంబంధించి డాక్యుమెంట్లు, ఏజ్ రిలాక్సేషన్, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు రెడీగా ఉంచుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో వీటిలో ఏ డాక్యుమెంట్ సమర్పించకపోయినా ఆ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది.

## బీజేపీ ఎన్ని కేసులు పెట్టినా.. తల వంచకుండా పోరాటం చేస్తాం : బాల్క సుమన్



న్యూఢిల్లీ : బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ ఎన్ని కేసులు పెట్టినా.. తల వంచకుండా పోరాటం చేస్తామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాల్క సుమన్ స్పష్టం చేశారు. కవిత మానసికంగా బలంగా ఉన్నారు అని తెలిపారు. తీహార్‌లో జైల్లో కవితతో ములాఖత్ అయిన తర్వాత సుమన్ మీడియాతో మాట్లాడారువిపక్ష నాయకులను అణిచివేయలనే అన్యాయంగా కవితను ఈ కేసులో ఇరికించారు. న్యాయస్థానాలపై నమ్మకం ఉంది. న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో కవిత ఉన్నారు. బీజేపీకి ఎవరు ఎదురు ఉండకూడదనే ప్రతిపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురిచేసింది. ఢిల్లీ లిక్కర్ కేసు కేసే కాదు.. అదొక పాలసీ? దాన్ని బూచిగా చూపించి తెలంగాణలో బీఆర్ఎస్, ఢిల్లీలో ఆప్ పార్టీని దెబ్బతీసే కుట్ర చేస్తున్నారు. ఇలాంటి కేసులతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురి చేయొచ్చనే భ్రమలో బీజేపీ నేతలు ఉన్నారు.. కానీ భయపడే ప్రసక్తే లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా దెబ్బతిన్నది. బీజేపీ 220 సీట్లు దాటదు. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే అని బాల్క సుమన్ స్పష్టం చేశారు.

## ఖమ్మం టౌన్ లో రాకేష్ రెడ్డి ప్రచారం

ఖమ్మం,ఉమ్మడి వరంగల్ – ఖమ్మం – నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అనుముల రాకేష్ రెడ్డి ఖమ్మంలో ప్రచారం చేసారు. ఎస్సార్ అండ్ బీజీఎన్నార్ డిగ్రీ కళాశాల గ్రౌండ్లో జిల్లా అధ్యక్షులు తాతా మధు తో కలిసి వాకర్స్ ను ఓటు అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదట ప్రాధాన్యత ఓటు 3వ నెంబర్ పై వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను అనగ తొక్కుతుందన్నారు. సమస్యలపై ప్రశ్నించే గొంతులను నొక్కి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ జె సి కృష్ణ, కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


# జగన్ ధీమా కారణం ఏమిటో

విజయవాడ, మే 17 జగన్ ధీమాతో ఉన్నారా? ఆయన లెక్క ఆయనకు ఉందా? అందుకే కాన్ఫిడెంట్ గా కనిపిస్తున్నారా? లేకుంటే పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే ఆ ప్రయత్నమా? పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఎన్నికల్లో సూపర్ విక్టరీ సాధిస్తానని జగన్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా వైసీపీ విజయం.. సంచలనంగా మారుతుంది అని కూడా తేల్చి చెప్పారు. తాజాగా ఆయన ఐ ప్యాక్ టీం సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.గత ఎన్నికల ముందు నుంచి ఐపాక్ టీం వైసీపీ కోసం పనిచేస్తోంది. ఈ టీం ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలో ఏర్పడింది. గత ఎన్నికల్లో వైసీపీకి విజయం సాధించిన తర్వాత ప్రశాంత్ కిషోర్ వ్యూహకర్త పదవిని వదులుకున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. సొంత రాష్ట్రం బీహార్లో రాజకీయాలు చేస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో పోలింగ్ నాడే.. సీఎం జగన్ ప్రశాంత్ కిషోర్ ను కలిసారు. సూపర్ విక్టరీ కొట్టామని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అయితే ఈసారి మాత్రం వైసీపీలో ఆ ధీమా కనిపించలేదు. గతం మాదిరిగా ఐపాక్ టీం అధినేత రుషిరాజ్ సింగ్ ను జగన్ కలవలేదు. దీంతో ఒక రకమైన చర్చ ప్రారంభమైంది. అందుకే ఈరోజు జగన్ విజయవాడ బెంజ్ సర్కిల్ లో ఉన్న ఐ ప్యాక్ కార్యాలయాన్ని ప్రత్యేకంగా సందర్శించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో జగన్ హాట్ కామెంట్స్ చేశారు. రేపు ఫలితాలను చూసి దేశం షాక్ కు గురవుతుందని చెప్పుకొచ్చారు. ఆసక్తికర ఫలితాలు వస్తాయని కూడా తేల్చి చెప్పారు. దీంతో ఇదో వైరల్ అంశంగా మారింది. పోలింగ్ శాతం పెరగడం, ఉద్యోగ ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత, వంటి కారణాలతో వైసిపి శ్రేణులు డీలా పడ్డాయి. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా 81.86% ఓటింగ్ నమోదు అయ్యింది. పోలింగ్ వరకు నువ్వా నేనాఅన్నట్టు సమరం సాగింది. అందుకు తగ్గట్టుగానే ఓటింగ్ సైతం జరిగింది. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఓటర్లు తరలి రావడంతో ఓటమికి అనుకూలమని ప్రచారం ప్రారంభమైంది. దీంతో జగన్ సైతం అలెర్ట్ అయ్యారు. విజయంపై ధీమా వ్యక్తం చేస్తూనే.. ఓటింగ్ సరళి పై సమీక్షించి ఒక స్పష్టతకు వచ్చారు.ప్రభుత్వంపై వ్యతిరేకత, పెరిగిన పోలింగ్ వంటి అంశాలు పూర్తిగా తమకే అనుకూలిస్తాయని కూటమి అంచనా వేసింది. భారీ మెజారిటీ ఖాయమని లెక్కలు వేసింది. అయితే ఉదయానికే మహిళలు, వృద్ధులు ఓటు వేసేందుకు బారులు తీరడంతో వైసీపీలో ఆశలు చిగురించాయి. గత ఎన్నికల కంటే ఎక్కువ శాతం ఓటింగ్ నమోదు కావడంతో అదంతా ప్రభుత్వ వ్యతిరేకత అని కూటమి అంచనా వేసింది. విశ్లేషణలు కూడా అలానే వచ్చాయి. దీనికి తోడు అర్ధరాత్రి వరకు 1500 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. ఎన్నికల సంఘం అధికారికంగా లెక్కలు వెల్లడించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలుపుకొని 82% ఓటింగ్ నమోదైనట్లు ప్రకటించింది.ఏపీలోని ప్రధాన నగరాల్లో ఓటింగ్ శాతం తగ్గడం, మహిళా ఓటింగ్ పెరగడంతో అధికార పార్టీ కొత్త అంచనాకు వచ్చింది. ఐప్యాక్ టీం, సోషల్ మీడియా విభాగంతో సీఎం జగన్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పోలింగ్ సరళి పై చర్చించారు. నియోజకవర్గాల వారీగా నివేదికలతో విశ్లేషించారు. కోటి 69 లక్షల మంది మహిళలు ఓటింగ్లో పాల్గొన్నారని.. వారితో పోల్చుకుంటే పురుష ఓట్లు ఐదు లక్షలు తగ్గాయని.. సంక్షేమ పథకాల ప్రధాన లబ్ధిదారులు మహిళలు కావడంతో.. వారు తప్పకుండా వైసీపీ వైపు మొగ్గు చూపుతారని జగన్ ఒక లెక్కకు వచ్చారు. టిడిపి కంచుకోట లాంటి నియోజకవర్గాల్లో సైతం మహిళలు ఎక్కువగా ఓట్లు వేశారని భావిస్తున్నారు. ఈ ధైర్యంతోనే జగన్ తాజాగా ఒక ట్వీట్ చేశారు. ఇప్పటివరకు సాగిన పాలన.. మరింత మెరుగ్గా సాగుతుందని హామీ ఇచ్చారుఈ నేపథ్యంలోనే జగన్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. అందుకే నేరుగా ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి ఈ కీలక ప్రకటన చేసినట్లు సమాచారం. కేవలం వైసీపీ ఓటమి చెందుతుందని వస్తున్న విశ్లేషణలు, ప్రచారానికి చెప్పేందుకే జగన్ కీలక ప్రకటన చేసినట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే జగన్ ప్రకటనతోవైసీపీ శ్రేణులు ఊపిరి పీల్చుకుంటున్నాయి.

# కుప్పం, పిఠాపురంలలో భారీ బెట్టింగ్స్

కాకినాడ, మే 17 (న్యూస్ పల్స్)సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. తెలంగాణలో ఎంపీ సీట్లకు, ఏపీలో ఎంపీ సీట్లతో పాటు అసెంబ్లీకి పోలింగ్ జరిగింది. కానీ తెలంగాణ కంటే ఏపీలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. భారీగా హింస చెలరేగింది. పోలింగ్ ముగిసిన రెండు రోజుల వరకు కొనసాగింది. దీంతోనే అర్థమవుతుంది ఏ స్థాయిలో ఫైట్ జరిగిందో. అందుకే ఏపీ ఫలితాల పట్ల అంతటా ఉత్కంఠ నెలకొంది. దీంతో బెట్టింగులు కూడా భారీ స్థాయిలో జరుగుతున్నాయి. భారీగా బెట్టింగ్ ముఠాలు ప్రవేశించినట్లు ప్రచారం జరుగుతోంది.వైసిపి మరోసారి అధికారంలోకి వస్తుందా? టిడిపి కూటమి అధికారాన్ని దక్కించుకుంటుందా? ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఎవరు గెలుస్తారు? ఎంత మెజారిటీ వస్తుంది? అన్న అంశాల చుట్టూ బెట్టింగ్ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. కోట్లలో ఈ బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం. లక్షకు ఐదు లక్షలు చొప్పున బెట్టింగ్ జరుగుతుండడం విశేషం. ప్రధానంగా ఏపీలో పిఠాపురం పైనే అందరి ఫోకస్ ఉంది. గత ఎన్నికల్లో పవన్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి మాత్రం పిఠాపురం నియోజకవర్గ నుంచి మాత్రమే పోటీ చేస్తున్నారు. అటు వైసీపీ సైతం గట్టిగానే ఫోకస్ పెట్టింది. అందుకే ఇప్పుడు పిఠాపురం చుట్టూ బెట్టింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. పవన్ గెలుస్తాడా? లేదా? అన్నదానిపై జోరుగా పందాలు కొనసాగుతున్నాయి. పవన్ తరువాత లోకేష్ పైనే ఎక్కువ బెట్టింగ్ సాగుతుండడం విశేషం. మంగళగిరి నుంచి పోటీ చేసిన లోకేష్ గత ఎన్నికల్లో ఓడిపోయాడు. ఎన్నికల్లో మరోసారి పోటీ చేస్తున్నాడు. ఇక్కడ సైతం వైసిపి పట్టు బిగించాలని ప్రయత్నించింది. అందుకే ఇక్కడ సైతం భారీ స్థాయిలో బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం.వై నాట్ కుప్పం అని వైసిపి సౌండ్ చేసింది. కుప్పంలో చంద్రబాబును ఎలాగైనా ఓడిస్తామని శపథం చేసింది. దీంతో అందరి చూపు కుప్పం వైపు పడింది. వైసిపి పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో రాజకీయంగా కుప్పం హాట్ టాపిక్ గా మారింది. అందుకే అక్కడ చంద్రబాబు గెలుస్తాడా? లేదా? అని ఎక్కువ మంది బెట్టింగ్ కాస్తున్నారు. చంద్రబాబుకు మెజారిటీ తగ్గుతుందా? లేదా? అన్న అంశంపై కూడా పందాలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు గెలుపోటములపై కాకుండా.. మెజారిటీపైనే ఎక్కువ శాతం బెట్టింగ్ జరుగుతుండడం విశేషం. అటు కడప పార్లమెంట్ స్థానంతో పాటు పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం పై కూడా బెట్టింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. షర్మిల ఎంపీగా గెలుపొందుతారని.. పులివెందులలో జగన్ మెజారిటీ తగ్గుతుందని.. ఇలా రకరకాలుగా బెట్టింగ్ సాగుతోంది. వీరితోపాటు ఏపీలో కీలక నాయకులు, వివాదాస్పద నేతలు పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై సైతం బెట్టింగ్ సాగుతుండడం విశేషం. అయితే బెట్టింగులు వందల కోట్ల రూపాయలకు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

# కాన్ఫిడెన్స్ అంతా అదేనా




గుంటూరు, మే 17,టిడిపి అధినేత చంద్రబాబు ఈ ఎన్నికల్లో గెలుస్తామని ఫుల్లు కాన్ఫిడెన్స్ లో ఉన్నారు. ఆయన గతంలో ఎన్నడూ లేని విధంగా గెలుపుపై ధీమాగా ఉన్నారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ కావచ్చు... పోలింగ్ శాతం పెరగడం కూడా తమ గెలుపునకు తిరుగుండదని ఆయన భావిస్తున్నారు. నిన్న మోదీ నామినేషన్ కార్యక్రమానికి వెళ్లిన చంద్రబాబు అక్కడ బీజేపీ సీనియర్ నేతలకు ఇదే విషయాన్ని చెప్పారట. ప్రమాణస్వీకారానికి రమ్మని ఆహ్వానం కూడా పలికారన్న టాక్ పార్టీలో వినిపిస్తుంది. చంద్రబాబు ఎన్నికల రోజు మొత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి వరకూ పార్టీ కేంద్ర కార్యాలయంలోనే కూర్చుని ఉన్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన సూచనలు కూడా ఇచ్చారు. మహానాడు కూడా ప్రభుత్వ ఏర్పాటు కోసమే వాయిదా వేసినట్లు ఆయన చెప్పడం విశేషం. పోలింగ్ జరిగిన తీరుపై ఎప్పటికప్పుడు నియోజకవర్గాల నుంచి నివేదికలు తెప్పించుకున్న ఆయన కూటమికి 120 స్థానాలకు పైగానే గెలుస్తామని చెబుతున్నారట. పోలింగ్ శాతం పెరగడంతో గెలిచే స్థానాల సంఖ్య కూడా ఊహించని విధంగా పెరిగే అవకాశముందని ఆయన అంచనా వేస్తున్నారట. తన నలభైఐదేళ్ల రాజకీయ అనుభవం ఎప్పుడూ ఇంతగా ఫెయిర్ ఓటింగ్ జరగలేదంటున్నారు. ప్రభుత్వంపై కసితో వచ్చిన ఓటర్లు నేరుగా అభ్యర్థిని చూడకుండా తనను చూసి, కూటమి అభ్యర్థులకు ఓటు వేశారని ఆయన గర్వంగా సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు తెలిసింది. విదేశాల నుంచి మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓటర్లలో 80 శాతం మన వైపే ఉన్నారంటూ తనకు అందిన నివేదికల ద్వారా అందాయని ఆయన చెబుతున్నారని తెలిసింది. మరోవైపు మహిళలు ఎక్కువగా వైసీపీ వైపు మొగ్గు చూపుతారన్న వాదనలో అర్థం లేదని కూడా ఆయన చెబుతున్నారట. అందుకు ప్రధాన కారణం ఫ్రీ బస్సు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల ప్రభావం మహిళలపై బాగా పనిచేసిందని తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్ ద్వారా తెలిసిందని అంటున్నారు. అందుకే ఎవరూ భయపడాల్సిన పనిలేదని, 120 స్థానాలకు పైగానే గెలిచి అధికారాన్ని చేపట్టబోతున్నామని ఆయన పార్టీ సీనియర్ నేతలతో అన్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కూటమి ఏర్పడాన్ని ప్రజలు కూడా స్వాగతించారని, రాష్ట్ర భవిష్యత్ ను గురించి కూడా ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేశారని, అందుకే కూటమి గెలుపును ఈ ఎన్నికల్లో ఎవరూ ఆపలేరని కూడా ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తాను సీఎంగా శాసనసభలో అడుగుపెడతానన్న శపథం నెరవేరబోతుందని కూడా సీనియర్ నేతల వద్ద కామెంట్ చేసినట్లు చెబుతున్నారు.అలాగే నిర్లక్ష్యం వహించిన కొన్ని నియోజకవర్గాల పేర్లను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు తెలిసింది. కూటమి ఏర్పడటంతో ఎలాగూ గెలుస్తామని డబ్బులు బయటకు తీయని నేతల పేర్లు తన వద్ద ఉన్నాయని, వారు ఓటమి అంచున ఉన్నారని కూడా చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు సమాచారం. వారి స్వయంకృతాపరాధం కారణంగానే ఓటమి పాలవుతున్నారని ఆయన అన్నారు. తాను చెప్పినా వినకుండా ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లాల్లో ఒకరిద్దరు నేతలు మితిమీరిన ఆత్మవిశ్వాసానికి పోవడం వల్ల గెలుపు కష్టమయిందన్నారు. మరికొందరు నేతలు పార్టీలో ఉండి కూడా కూటమి అభ్యర్థులకు సహకరించకపోవడం వల్ల కూడా కొన్ని స్థానాలను కోల్పోతున్నామని చంద్రబాబు క్లియర్ కట్ గా ఆ స్థానాల గురించి కూడా సీనియర్ నేతల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది

# అసెంబ్లీకి ఎవరు వస్తారు...

విజయవాడ, మే 17 ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాక మునుపే.. రకరకాల చర్చ నడుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీకి నేతల హాజరు చుట్టూనే విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబు గెలిస్తే జగన్ విపక్షనేతగా అసెంబ్లీకి వస్తారా? జగన్ గెలిస్తే చంద్రబాబు రాగలరా? పవన్ పాత్ర ఏంటి? లోకేష్ ఏం చేస్తారు? ఇటువంటివి హాట్ టాపిక్ గా మారాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది. తమ గొంతు నొక్కుతుందని వైసీపీ సభ్యులు శాసనసభకు హాజరు కాలేదు. నిండు సభలో తన భార్యను అవమానించారని చంద్రబాబు శాసనసభను బాయ్ కట్ చేశారు. మళ్లీ ముఖ్యమంత్రి గానే హౌస్ లో అడుగు పెడతానని శపథం చేశారు.అయితే సీఎం అయితేనే చంద్రబాబు శాసనసభలో అడుగు పెట్టగలరు. అటు జగన్ ది అదే పరిస్థితి. అంటే అధికారంలోకి వస్తేనే వారు హౌస్ లో అడుగుపెట్టే ఛాన్స్ ఉందన్నమాట.శాసనసభ అన్నది ప్రజాస్వామ్యంలో ఒక దేవాలయం లాంటిది. ప్రజా సమస్యలు ప్రస్తావనకు వచ్చేది అక్కడే. వాటికి పరిష్కార మార్గందక్కేది అక్కడే. కానీ అటువంటి శాసనసభ సమావేశాలను బహిష్కరించి ప్రజా సమస్యలను గాలికి వదిలేసారన్న విమర్శలు ఉన్నాయి. 2014లో టిడిపి గెలిచిన తర్వాత.. వైసీపీ ఎమ్మెల్యేలపై వేటుపడింది. రోజా లాంటిఎమ్మెల్యేలపై శాశ్విత వేటు వేశారు. దీనిని నిరసిస్తూ నాడు జగన్ మొత్తం శాసనసభనే బహిష్కరించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాతే హౌస్ లో అడుగు పెడతానని తేల్చి చెప్పారు. అందుకు తగ్గట్టుగానే గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన తర్వాత హౌస్ లో అడుగు పెట్టారు.2019లో జగన్ అధికారంలోకి వచ్చారు. అంతకుముందు తనకు ఎదురైన ప్రతి పరిణామాన్ని రిపీట్ చేశారు. హౌస్ లో టిడిపి సభ్యులను ముప్పు తిప్పలు పెట్టించగలిగారు. ఒకానొక దశలో చంద్రబాబు ౦ పై వైసీపీ సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో.. చంద్రబాబు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. అసెంబ్లీలోనే శపథం చేశారు. మళ్లీ తాను సీఎం గానే హౌస్ లో అడుగు పెడతానని తేల్చి చెప్పారు. అయితే ఇప్పుడు కూటమి గెలిస్తే ఆయన శపథం తప్పకుండా నెరవేరుతుంది. ఒకవేళ ఓటమి ఎదురైతే మాత్రం.. ఆ బాధ్యతను పవన్ కైనా.. లోకేష్ కైనా అప్పగించే అవకాశం ఉంది. పొరపాటున వైసిపి ఓడిపోతే మాత్రం జగన్ వచ్చే పరిస్థితి ఉండదు. అంతకుముందు తన నుంచి ఎదురైన పరిణామాలు.. తనకు తిరిగిగుచ్చుకుంటాయని తెలుసు. అందుకే జూన్ 4న ఫలితాలు కేవలం అధికారం కోసమే కాదు.. ఒకరిపై ఒకరు ఉక్కు పాదం మోపేందుకే నన్న విషయం అందరికీ తెలిసిందే.

# తాడిపత్రిలో పోలీసుల సీసీ కెమెరాలు ధ్వంసం

అనంతపురం, మే 17ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ అనంతరం జరుగుతున్న హింసాత్మక ఘటనల్లో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. అనంతపురంలోని తాడిపత్రిలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. ముఖ్యంగా వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దరెడ్డి, టీడీపీ నేతలు జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య ఎప్పటి నుంచో ఉన్న వైరం ఇప్పుడు తారాస్థాయికి చేరింది. ఇందులో భాగంగా ఒకరిపై ఒకరు రాళ్లు వేసుకున్నారు.ఇది తీవ్ర రూపం దాలుస్తున్న టైంలో పోలీసులు కలుగు చేసుకొని ఇద్దర్నీ రహస్య ప్రాంతాలకు తరలించారు. కొందరు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఓ ఆసక్తికర ఘటన వెలుగులోకి వచ్చింది. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటికి వెళ్లిన పోలీసులు అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్‌ను ధ్వంసం చేయడం చర్చనీయంశమైంది.జేసీ ఇంటిపైకి దాడికి యత్నించిన వ్యక్తుల్లో కీలకమైన వ్యక్తి పెద్దారెడ్డి ఇంట్లో దాక్కున్నాడని ఆయన్ని పట్టుకోవడానికే పోలీసులు ఆ ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించారు. ఆ టైంలో తలుపులు, గేట్లు పగలగొట్టి ఆయన ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలు కూడా ధ్వంసం చేశారు. ఆ ఫుటేజ్ హార్డ్ డిస్క్‌లను కూడా తమతో తీసుకెళ్లారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆరోజే చెప్పారు. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన సీసీటీవీ ఫుటేజ్ చూస్తే అదంతా నిజమని తెలుస్తోంది. అయితే పోలీసులు తీసుకెళ్లిన వీడియో ఫుటేజ్ ఇప్పుడు మీడియాకు ఎలా వచ్చిందని చర్చ నడుస్తోంది. ఇద్దరు నేతలు తాడిపత్రి నుంచి దూరంగా తీసుకెళ్లిపోయిన పోలీసులు అక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

# కుప్పంలో భారీ పోలింగ్

## ఎవరి వైపు ఓటరు

తిరుపతి, మే 17, కుప్పం నియోజకవ ర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ఈసారి ఓడిస్తామని వైసీపీ శపథం చేసింది. అలాగే లక్షకు పైగా మెజారిటీతో కుప్పంలో ఈసారి గెలుస్తానని చంద్రబాబు ప్రతిన బూనారు. దీంతో కుప్పం నియోజక వర్గంలో ఎవరి మాట నెగ్గుతుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అందుకే కుప్పంలో మెజారిటీపై కూడా భారీ స్థాయిలో బెట్టింగ్ లు జరుగుతు న్నాయి. అందుకే కుప్పం నియోజకవ ర్గం వైపు అందరి చూపు ఉంది. చంద్రబాబుకు వచ్చే మెజారిటీ ఎంత? అన్న దానిపై టీడీపీ నేతల్లో టెన్షన్ నెలకొండగా, ఈసారి కుప్పం కోటను ఛేదిస్తామని వైసీపీ నేతలు చెబుతున్నా రు. ఈ నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదు కావడంతో ఎవరికి అడ్వాంటేజీ అన్నది తేలకుండా ఉంది కుప్పం నియోజకవర్గం అంటే చంద్రబాబుకు అడ్డా. ఆయన ఏడుసార్లు ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఈసారి గెలిస్తే రికార్డు స్థాయిలో వేరెవరూ వరసగా గెలవనన్ని సార్లు చంద్రబాబు గెలిచి రికార్డు సృష్టించినట్లే అవుతుంది. 1989, 1994, 1999, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో చంద్రబాబు కుప్పం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ నుంచే గెలిచారు. చంద్రబాబు ఇన్ని సార్లు గెలిచినా గత ఎన్నికల్లో మాత్రం ఆయన మెజారిటీ తగ్గింది. ప్రతి ఎన్నికల్లో చంద్రబాబు తన ప్రత్యర్థి కంటే యాభై వేల మెజారిటీతో గెలుస్తుంటారు. కానీ 2019 ఎన్నికల్లో మాత్రం వైసీపీ అభ్యర్థి చంద్రమౌళి మీద కేవలం 30 వేల మెజారిటీతోనే విజయం సాధించారు. అందువల్లనే వైసీపీ కుప్పంలో చంద్రబాబును ఎందుకు ఓడించలేమని తొలి నుంచి అక్కడ ఫోకస్ పెట్టింది. చంద్రమౌళి కుమారుడు భరత్ ను వైసీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీని చేసింది. కుప్పం నియోజకవర్గానికి ఇన్ ఛార్జిగా నియమించింది. కుప్పం ను రెవెన్యూ డివిజన్ ను చేసింది. హంద్రీ నీవా నీళ్లను తెచ్చామని చెప్పుకుని ఈ ఎన్నికల బరిలోకి దిగింది. అయితే చంద్రబాబు మాత్రం కుప్పం ప్రజలపై పూర్తిగా విశ్వాసం ఉంచారు. ఎన్నికల సమయంలో పెద్దగా కుప్పంలో ప్రచారం కూడా ఆయన చేయలేదు. అంత కాన్ఫిడెన్స్ తో ఆయన ఉన్నారని వేరే చెప్పాల్సిన పనిలేదు. అయితే ఇప్పుడు వచ్చిన పోలింగ్ శాతం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఎప్పుడూ ఇంత స్థాయిలో పోలింగ్ జరగకపోవడంతో ఎవరికి వారే తమదే గెలుపు అంటూ సోషల్ మీడియాలో సవాళ్లు విసురుకుం టున్నారు. కుప్పం నియోజకవర్గంలో దాదాపు 2.20 లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా అందులో 89.88 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారిక లెక్కల ద్వారా తేలింది. అత్యధికంగా కుప్పం నియోజక వర్గంలో పోలింగ్ శాతం నమోదయిం ది. ఇప్పుడు ఈ ఓటింగ్ శాతంపైనే పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. కుప్పంలో చంద్రబాబు చేసిన అభివృద్ధితో పాటు ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థి కావడంతో ఆయన గెలుపునకు ఢోకా లేదని టీడీపీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.

# జూన్ 19 వరకు కేంద్ర బలగాలు

విజయవాడ, మే 17 ఏపీ విషయంలో ఎలక్షన్ కమిషన్ సీరియస్ గా ఉంది. పోలింగ్ సందర్భంగా హింస చెలరేగిన సంగతి తెలిసిందే. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అల్లర్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ సిఎస్ జవహర్ రెడ్డి, డిజిపి హరీష్ కుమార్ గుప్తాలను ఢిల్లీకి పిలిపించిన ఈసీ సంజాయిషీ కోరినట్లు సమాచారం. ఒకానొక దశలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అల్లర్లను నియంత్రించేందుకు కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు నిఘా వర్గాల హెచ్చరికల మేరకు ఎన్నికల ఫలితాల అనంతరం.. హింస చెలరేగే అవకాశం ఉందని.. రాజకీయ దాడులకు ప్రయత్నించే ఛాన్స్ ఉందని తెలియడంతో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. జూన్ 19 వరకు కేంద్ర పోలీస్ బలగాలను ఏపీలో కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అవసరమైతే అదనపు బలగాలను పంపించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో దాడులు జరుగుతున్నాయి. తమకు ఓటు వేయలేదన్న నెపంతో ఈ దాడులు కొనసాగుతున్నాయి.గత ఐదు సంవత్సరాలుగా ఏపీలో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉండేది. అధికార పార్టీ దూకుడు మీద వ్యవహరించేది. అయితే ఇప్పుడు టిడిపి కూటమి సైతం సమ ఉజ్జీగా నిలవడం, అనుకూల ఫలితాలు వస్తాయని విశ్లేషణలు ప్రారంభం కావడం.. తదితర కారణాలతో అధికార, విపక్షం మధ్య హోరాహోరీ పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలోనే దాడులు జరుగుతున్నాయి. అయితే ముందుగా అంచనా వేయడంలో యంత్రాంగం విఫలమైంది. దీంతో పోలింగ్ రోజే కాకుండా.. ఆ తరువాత కూడా హింస చెలరేగింది. ఈసారి పల్నాడు, మాచర్లలో తారాస్థాయికి చేరుకుంది. అనంతపురం, తిరుపతిలో కూడా రాజకీయ దాడులు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలను గృహనిర్బంధం చేశారు. అటు కేంద్ర బలగాలు వచ్చినాహింస ఆగడం లేదు. దీంతో ఈసీ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి తో పాటు డీజీపీలను ఢిల్లీ రప్పించింది. స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం.. రెండు వారాలపాటు కేంద్ర బలగాలు ఏపీలో ఉండేలా ఆదేశాలు ఇచ్చింది.

# కసిగా ఓట్లేసిన కమ్మ, కాపు

గుంటూరు, మే 17 ఏపీలో కుల రాజకీయాలు చాలా ఎక్కువ. 2024లో ఎన్నికల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా ఏపీలోని కమ్మ, కాపు సామాజికవర్గాలు ఈసారి ఎన్నికల్లో ఎక్కువగా ఓట్లు వేసినట్లు భావిస్తున్నారు. కాపు సామాజికవర్గానికి చెందిన పవన్ కోసం కాపులు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కోసం కమ్మలు కసిగా ఓటు వేసినట్లు అభిప్రాయపడుతున్నారు.ఏపీలో జగన్ కాపు సమాజిక వర్గానికి చెందిన పవన్‌ను టార్గెట్ చేయడంతో కాపుల్లో పవన్ తమ ప్రతినిధిగా ఓన్ చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈసారి కాపులు దేశంతోపాటు విదేశాల నుంచి కూడా వచ్చి ఓట్లు వేశారని తెలుస్తోంది.ఇక ఏపీ సీఎం జగన్‌కు చంద్రబాబుకు మధ్య మొదటి నుంచి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది.

# అకస్మికంగా వార్డు సచివాలయాలు తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 17- పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి 30-26 వార్డు సచివాలయాలను అకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు , ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు . ప్రతి వార్డులో పారి శుద్ధ్యంపై అధికారులు సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు . వార్డులో తిరుగుతూ శానిటేషన్ పనులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. శానిటేషన్ కార్మికులతో రోడ్లు డ్రైనేజీ లను శుభ్రం చేయించారు . సచివాలయ సిబ్బంది కి పలు సూచనలు చేశారు.

# రైతు భరోసా కేంద్రాలలో జీలుగలు

## మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 17 - నంద్యాల మండలానికి 320 క్వింటాళ్ల జీలుగలు ప్రభుత్వం మంజూరు చేసిందని మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ జీలుగలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అటువంటి వారికి సగం సబ్సిడీ కింద జీలుగలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎకరాకు 10 కేజీలు. మినుమమ్5 ఎకరాలకు 50 కేజీలు మాత్రమే ఇస్తామని తెలిపారు. క్వింటా పూర్తి ధర 8800 ఉందని రైతులకు సబ్సిడీ కింద 4400 మాత్రమే ధర చెల్లించాలనిఅన్నారు.అనంతరం ప్రోసెసింగ్ ప్లాంట్స్ ను సహాయ వ్యవసాయ సంచాలకులు డా రాజ శేఖర్. తనిఖీ చేయడం జరిగిందన్నారు .తనిఖీలో భాగంగా శ్రీ బాలాజీ సీడ్స్ మరియు హరిత అగ్రొటెక్ ప్రోసెసింగ్ ప్లాంట్ లో రిజిస్టర్ ,బిల్ బుక్స్ తనిఖీ చేసి పచ్చిరొట్ట ఎరువుల ప్రోసెసింగ్ విధానం తనిఖీ చేసి వారికి నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని సూచించారు

# ఎర్రగుంట్ల లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా :ఈఓఆర్డీ శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 17- బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల గ్రామంలో మంచి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని ఈఓఆర్డీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంట్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ కలుషితం కావడంతో 20 మంది అతిసార బారిన పడ్డారని తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్ ను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితమైందన్నారు.ఎర్రగుంట్ల గ్రామంలో ప్రజలందరూ కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగ వలెనని దండోరా వేపించడం జరిగిందన్నారు . ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు . గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఓఆర్డీ వెంట పంచాయతీ అధికారులు. సచివాలయ సిబ్బంది ఉన్నారు .

# నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టండి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 17 - ప్రమాదకరమైన డయేరియా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు డీఎంహెచ్వో, డిపిఓ, గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో డయేరియా బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలపై సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రామతీర్థం, యర్రగుంట్ల గ్రామాల్లో వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డిఎంహెచ్ఓ ను ఆదేశించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా వ్యాధులు ప్రబలే అవకాశం వుందని త్రాగునీటి క్లోరినేషన్ తో పాటు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ, మున్సిపల్ అధికారులను కలెక్టర్ సూచించారు. పైపులైన్ల లీకేజీల మరమ్మతులు, ముమ్మర పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా వుంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డయేరియా వ్యాధి బారిన పడకుండా సరైన సూచనలు, సలహాలివ్వాలన్నారు.ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డిఎంహెచ్వో డాక్టర్ వెంకట రమణ, డిపిఓ మంజులవాణి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేడు శ్రీ వాసవి జయంతి మహోత్సవం...



ఎమ్మిగనూరు మే 17 విభారే న్యూస్. .వైశాఖ శుద్ధ దశమి శ్రీ వాసవి మాత జయంతిని పురస్కరించుకొని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో వివిధ పూజలు నిర్వహించబడును.. ప్రాతః కాలమున ఉ.5.15 ని.లకు. సుప్రభాత సేవ,ఉదయం 6:00 గంటలకు శ్రీరామ స్వామి దేవాలయం నుండి అమ్మవారి, నగేశ్వర స్వామి వారికి తుంగభద్ర నది జలాలు, కలశం చెంబులలో 102 రకాల సుగంధ ద్రవ్య జలాలతో అమ్మవారికి అభిషేకనీ. సన్నాయి మేళంతో ఊరేగింపు కార్యక్రమం.ఉదయం 8:45ని లకు శ్రీమతి ఆర్వేటి కిరణ్మయి, ఆర్వేటి నాగయ్య శెట్టి దంపతులచే పతాకావిష్కరణ, ఉదయం 9 గంటలకు అభిషేకం, 10 గంటలకు కుంకుమార్చన, అమ్మవారికి నామకరణ మహోత్సవం వివిధ పూజా కార్యక్రమాలు అన్నియు నిర్వహించబడును. పై పూజా కార్యక్రమాలన్నియు ఆలయ అర్చకులు రాతన గురు ప్రసాద్ స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించబడును. పూజా కార్యక్రమంలో పాల్గొను దంపతులు సాంప్రదాయ దుస్తులను, నూతన వస్త్రములు ధరించి అభిషేకం నందు పాల్గొనవలెను.సాయంత్రం 4:25 ని లకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి కేరళ వాయిద్యంతో పల్లకి ఊరేగింపు కార్యక్రమం. శ్రీ వాసవి జయంతి పర్వదినం శుభ సందర్భంగా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరం కర్నూలు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరడమైనది.కర్నూలు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు దేవకి జనార్దన్ కి ఆర్యవైశ్య సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదములు. జయంతి సందర్భంగా పై కార్యక్రమాలలో ఆర్యవైశ్య మహిళలు పురుషులు కుటుంబ సమేతంగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం. ఉదయం పతాకావిష్కరణ అనంతరం అల్పాహారము, మధ్యాహ్నం విందు,సాయంత్రం పల్లకి ఊరేగింపు అనంతరం అల్పాహారం ఏర్పాటు చేయడమైనది.శ్రీ వాసవి జయంతి సందర్భంగా ఉదయం నుండి రాత్రి వరకు జరుగు కార్యక్రమాలకు స్వచ్ఛందంగా విరాళాలు అందించిన దాతలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు.సాయంత్రము 4 గంటల లోపు తమ తమ వ్యాపార సంస్థలను మూసివేసి కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున అమ్మవారి పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొంటూ అమ్మవారి సేవా కృపకు పాత్రులగురని ఆర్యవైశ్య సంఘం వారు కోరారు.

# ఘనంగా అంతర్జాతీయ స్త్రీ నిర్మూలన దినోత్సవం



ముదిగుబ్బ మే 17 ముదిగుబ్బ మండల కేంద్రంలో స్థానిక ఆర్డిటి కార్యాల యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం బత్తలపల్లి రీజనల్ డైరెక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో ఏరియా టీం లీడర్ కృష్ణ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముదిగుబ్బ అర్బన్ సీఐ యతేంద్ర మాట్లాడుతూ ఆర్డిటి సంస్థ చేపడుతున్నటువంటి అభి. వృద్ధి కార్యక్రమాలలో ప్రజలం దరూ ఎంతో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు అన్నా రు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ నిర్మూలన దినోత్సవం జరుపుకోవాలని ఎంతో గొప్ప విషయం అన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు, స్త్రీలు వివిధ కారణాల చేతన హింసకు గురవుతున్నారు ముఖ్యంగా సమాజంలో స్త్రీల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం పెంచుకోవాలని పురుషులకు సమానంగా స్త్రీలకు హోదా కల్పించాలని కుటుంబంలో మహిళలకు తగిన స్థానాన్ని కల్పించి విలువలతో కూడిన గౌరవాన్ని ఇవ్వాలని ఎటువంటి హింస కారణాలు చేపట్టరాదని తెలియజేశారు. ఎక్కడైనా సమాజంలో మహిళలకు వారి గౌరవాన్ని భంగపరిచినట్లయితే చట్టరీత్యా శిక్షాహర్హులవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఏరియా టీమ్ లీడర్ కృష్ణ, ఏరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కేంద్రం వద్ద నిరసన తెలిపిన రైతులు నాణ్యమైన కరెంటు అందివ్వాలని ధర్నా



ముదిగుబ్బ మే 17 )స్థానిక విద్యుత్ కేంద్రం నందు శుక్రవారం పొడరాళ్లపల్లి, ఆర్ఎస్ తండా, పూజారి తాండ, మంగళమడక, గ్రామాల రైతులు నాణ్యమైన కరెంటు అందిఇవ్వాలని విద్యుత్ కేంద్రం నందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో ఇలాంటి సమస్య పైన విద్యుత్ అధికారులను కలిసి విద్యుత్ సరఫరా సరిగా రాకపోవడం వలన చేతికొచ్చిన పంటలు తీవ్రంగా నష్టపోతున్నాము అని అధికారులకు తెలియజేయగా ప్రత్యామ్నాయంగా అధికారులు మారాల విద్యుత్ కేంద్రం నుండి సరఫరా అందించారు. అలాంటిది ఇప్పుడు మారాల విద్యుత్ కేంద్రం సరఫరాను నిలిపివేసి ముదిగుబ్బ విద్యుత్ కేంద్రం నుండి సరఫరా అందిస్తున్నారు. విద్యుత్ కేంద్రం నుంచి వచ్చే కరెంటు నాణ్యత లేకపోవడంతో పెట్టిన పంటలు సమయానికి నీరు లేక రైతులందరూతీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

# సీజన్ వ్యాధుల బారిన పడకుండా చూడండి : సిపిఐ నాయకులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 17-నంద్యాల పట్టణ ప్రజలు వచ్చే సీజన్లో అంటురోగాల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామి ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్ కోరారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పారిశుద్ధ్య లోపం వల్ల ప్రజలు అంటు రోగాల బారిన అతిసారా వ్యాధితో బాధపడు తున్నారు.నంద్యాల టౌన్ లో అనేక వార్డులలో మంచినీటి కుళాయిలలో ఇప్పటికీబురద నీరు మురికి నీరు రావడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పట్టణములోని 42 వార్డులలో దోమల బెడద వల్ల అక్కడి ప్రజలు డెంగ్యూ మలేరియా విష జ్వరాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలు సీజన్ వ్యాధుల బారిన పడకుండా కాలువలలో పూడికలు తీసి మంచినీటి కులాయి పైపులు లీకేజీలు ఉన్నచోట మరమ్మతులు చేసి అన్ని వార్డులలో దోమల నివారణకు పాగింగ్ చేసి అంటూ రోగాల బారిన పడకుండా చూడాలని కోరారు.

# గురువు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న సుజాతమ్మ...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మే 17 తమ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంటూ తమకు అలహరిలో విద్యాబోధన చేసినటువంటి గురువు హనీఫ్ ను శుక్రవారం డోన్ పట్టణంలో ఆయన స్వగృహం నందు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీ కోట్ల సుజాతమ్మ

# ఆవోపా ఆధ్వర్యంలో తొలిసారి ఘనంగా నిర్వహించన చలివేంద్రం




ఎమ్మిగనూరు మే 17 విభారె న్యూస్..గత 55 రోజుల నుండి నిర్విఘ్నంగా కొనసాగుతూ దాహార్థుల దప్పిక తీర్చి మన్ననలు పొందిన ఆవోపా చలివేంద్రం.ఆవోపా తన సామాజిక సేవా పరంపరలో భాగంగా తొలిసారిగా చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చలివేంద్రం నిర్వహణకు మొదటి రోజు నుండి శుక్రవారం వరకు చిట్టెం సర్వేశ్వరయ్య ఆర్థిక సహకారం అందించడమే కాకుండా ఎంతో శ్రమకోర్చి చలివేంద్ర నిర్వహణ కూడా నిర్వహించారు.ఆర్థిక సహకారం అందించడమే కాకుండా విసుగు లేకుండా నిర్వహణ భాద్యతలు కూడా నిర్వహించిన సర్వేశ్వరయ్య దంపతులను అభినందిస్తున్నాము.వారి నిరాడంబరతను, సేవాతత్పరతను మెచ్చి వాసవీ మాత అనుగ్రహం ఆ పుణ్య దంపతులకు కలగాలని ఆకాంక్షిస్తూగత 55 రోజులుగా నిర్వహించిన చలివేంద్రాన్ని శుక్రవారంతో ముగించి వేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190